క్లుప్తంగా

బీసీ కార్పొరేషన్ రుణ మేళా

ఆరిలోవ: జీవీఎంసీ **జోన్–2 పరిధిలో బుధ**వారం బీసీ కార్పొరేషన్ **రుణ మేళా నిర్వహిం**చారు. ఆరిలోవ కాలనీ **ఆఖరి బస్టాప్ వద్ద** జీవీఎంసీ కల్యాణ మం**డపంలో 9వ వార్డు నుం**చి 13వ వార్డు వరకు **బీసీ లబ్ధిదారుల కోసం** జోన్–2 కమిషనర్ కనక**మహాలక్ష్మి, పలు బ్యాం**కుల మేనేజర్లు రుణ మేళా ఏర్పాటు చేశారు. బీసీ లబ్ధిదారుల నుంచి రుణం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ అర్హులైన వారిని రుణం ఇవ్వడానికి ఎంపిక చేస్తారన్నారు. రుణాలు పొందేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇమ్మాన్యుయేల్ లూథరన్ చర్చ్ పాస్టర్‌గా శ్యామ్‌కుమార్

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ సెక్టార్–2లోని ఇమ్మాన్యుయేల్ లూథరన్ చర్చ్ పాస్టర్‌గా ఫారిస్ పాస్టర్ శ్యామ్‌కుమార్ ఇటీవల నియామకమయ్యారు. ఈ సందర్భంగా తాను బాధ్యతలు స్వీకరించినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. చర్చ్‌ను పరిపాలన, ఆర్థికపరంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. సంఘస్తులంతా ఐక్యతతో మెలిగి చర్చ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ



మాట్లాడుతున్న ప్రకాశరావు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అతుల్ ఆటోస్ ఎండీ కె.వి.ఎస్.ప్రకాశరావు తెలిపారు. నగరంలో బుధవారం జరిగిన ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ డ్రైవింగ్ నేర్చుకొని స్వయం జీవనోపాధి పొందడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. ప్రతి 40 కిలో మీటర్ల రేంజ్‌లో సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. సౌత్ ఇండియా హెడ్ రామారావు, దీపేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణకు విశేష ఆదరణ

మురళీనగర్: స్థానికంగా నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు ఆదరణ పెరుగుతోంది. ఈ ప్రాంతంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్), బాలభాను పాఠశాలలో మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలభాను పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతులకు హాజరవుతున్న వారి సంఖ్య 54కు చేరిందని క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి చెప్పారు. వీరికి ఉచితంగా మెటీరియల్ అందిస్తామని తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 200 మంది, గైస్‌లో 161 మంది చేరినట్లు ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.నారాయణరావు, డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వీరందరికి టెక్నికల్ ఎడ్యుకేషన్ ముద్రించిన స్టడీ మెటీరియల్ అందిస్తామని వారు తెలిపారు.



ముంపు ముప్పు



ఇసుకతోట పెట్రోల్ బంక్ ఎదురుగా చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయిన ప్రధాన కాలువ



శివాజీ పార్కు రోడ్డు ద్వారం వద్ద గెడ్డలో పేరుకుపోయిన పూడికలు



ఇసుకతోట కూడలి రోడ్డుపై నీటి ప్రవాహం (ఫైల్)

మద్దిలపాలెం: నగరంలోని ప్రధాన కూడళ్లలో ఒకటైన ఇసుకతోట జంక్షన్ ముంపు ముప్పులో చిక్కుకుంది. మంగళవారం రాత్రి గంట పాటు కురిసిన వర్షానికి ఈ జంక్షన్ మురుగు నీటితో నిండిపోయింది. వాహనాలు సైతం రాకపోకలు సాగించేందుకు వీలులేనంతగా నీటి ప్రవాహం ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చింది. ఆ గంట పాటు సంద్రాన్ని తలపించింది. మునుపెన్నడూ లేనంతగా ఇసుకతోట కూడలిలో నీటి ప్రవాహం రావడానికి ప్రధాన కారణం అక్కడి ప్రధాన కాలువలోని పూడికలను సకాలంలో తీయకపోవడమే.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ తీరుపై విమర్శలు

ప్రధాన రహదారిపైకి నీటి ప్రవాహం వచ్చిన విషయం 22వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తెలిసినా.. తనకేమీ పట్టనట్టు వ్యవహరించడం విశేషం. 17వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది బుధవారం ఉదయం నుంచి రోడ్డును ఆనుకుని ఉన్న కాలువలో చెత్త తొలగించే పనిలో పడ్డారు. ఇదే వార్డులోని ప్రధాన కాలువ ద్వారా భారీ ఎత్తున చెత్తాచెదారం వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చింది. ఇదంతా రోడ్డుకు ఆనుకుని ఉన్న కాలువలోకి చేరింది. ఇసుకతోట హైవే పక్కనే ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ముందు చెత్తతో కాలువ నిండిపోయి అధ్వానంగా తయారైంది. దానిలోని మురుగు నీరు బంక్‌లోకి ప్రవహించింది. చెత్తాచెదారంతో రోడ్డంతా నిండిపోయింది. ఈ ఘటనపై 22వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించక పోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

కానరాని పూడిక తీత

22వ వార్డులోని ఏ కాలువను చూసినా పూడిక, చెత్తతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గెడ్డల పరిస్థితి మరీ దారుణం. రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవువయ్యారు. వర్షాలు కురిస్తే ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఈ వార్డులోనూ ఉన్నాయి. ఇక్కడ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏ కాలువలోనూ పూడికలు తీసినట్టులేదు. ఈ వార్డులో ప్రవహించే ప్రధాన గెడ్డను కోట్లాది రూపాయలతో ఆధునికీకరించినా ఫలితం లేదు. దీనిలో ఎక్కడ చూసినా పూడికలతో నిండిపోయి ఉంది. వాటిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. గెడ్డ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు ఇష్టానుసారంగా దానిలో చెత్త వేస్తున్నా.. పారిశుద్య అధికారులు పట్టించుకోవడం లేదు

దారుణంగా ప్రధాన కాలువ

ఇక్కడి రహదారికి ఆనుకుని ఎంవీపీ కాలనీ మీదుగా ప్రవహిస్తున్న ప్రధాన కాలువ పూడికలు, చెత్తతో పూర్తిగా నిండిపోయి ఘోరంగా తయారైంది. దీనిని శుభ్రం చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డుపైకి మురుగు నీరు చేరుతోంది. ఈ కాలువలో టన్నుల కొద్దీ చెత్తాచెదారంతోపాటు పూడికలు పేరుకుపోయాయి. 22వ వార్డులో శివాజీ పార్కు రోడ్డు ద్వారం వద్ద నుంచి 17వ వార్డులోకి ప్రవహించే మార్గంలో ఇసుకతోట జాతీయ రహదారి వెంబడిన ఉన్న ప్రధాన కాలువ దుస్థితి ఇది. ఈ కాలువను బుధవారం ఉదయం చూస్తే చెత్తతో పొంగిపోయి రోడ్లపైకి మురుగు నీరు ప్రవహిస్తూనే ఉంది. ఈ కాలువ దుస్థితిని గమనిస్తే ఇటు 22వ వార్డు.. అటు 17వ వార్డుల పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్య పనితీరుకు అద్దం పడుతోంది.

ఈగల మోత.. దోమల బెడద

వార్డులోని గెడ్డలు, కాలువల్లో నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పగటి పూట ఈగల మోత, సాయంత్రం వేళ దోమల బెడదతో స్థానికులు సతమతమవుతున్నారు. కాలువలు, గెడ్డల్లోని పూడికలపై, రోడ్ల మీద చెత్తకుప్పలపై వాలుతున్న ఈగలు ఇళ్లలోని ఆహార పదార్థాలపై వాలడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. సాయంత్రమయ్యేసరికి గుంపులుగా దాడి చేస్తున్న దోమల కాటు గురైతే మలేరియా, ఫైలేరియా జ్వరాల బారిపడే ప్రమాదముందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కన కాలువలో చెత్తాచెదారం

పారిశుధ్యం మెరుగు పరచాలి

22వ వార్డులో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై జీవీఎంసీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. కాలువలు, గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విమ్స్‌కు చెందిన 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎన్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

అసంపూర్తిగా యూజీడీ పనులు

- రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



కేఆర్ఎం కాలనీ చర్చ్ వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. కాలనీలోని చర్చ్ వద్ద యూజీడీ పనులు అసంపూర్తిగా చేయడంతో రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. యూజీడీ పైప్‌లైను ఏర్పాటు చేయడంలో జాప్యం వల్ల డ్రైనేజీ మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోందని స్థానికులు పీలా ఉమామహేశ్వరరావు తెలిపాడు. ఈ సమస్యపై యూజీడీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించాడు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పరిశుభ్రంగా గెడ్డ, కాలువలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలోని గెడ్డ, కాలువలు శుభ్రమయ్యాయి. ఇక్కడ బీఆర్‌టీఎస్ రహదారి పక్కన నివాసాలను ఆనుకొని ఉన్న గెడ్డ, వీధి కాలువలు చెత్తతో నిండిపోవడంతో కొన్నాళ్లుగా దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 8న 'బాబోయ్ దుర్వాసన' అనే శీర్షికన 'సాక్షి'లో వెలువడిన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించారు. బుధవారం పొక్లెయిన్‌తో గెడ్డలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. వీధి కాలువల్లో చెత్తను కార్మికులు తొలగించి మురుగు నీరు కిందకు ప్రవహించేటట్లు శుభ్రం చేశారు. దుర్వాసన నుంచి విముక్తి కలిగిందంటూ స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చెత్త తొలగించిన పారిశుద్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. రోజూ వీధుల్లోకి వస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రజలు ఇళ్లలో చెత్తను అందజేయాలని, కాలువలు, గెడ్డలో వేయకూడదని శానిటరీ సిబ్బంది కోరారు.



పైనాపిల్ కాలనీ గెడ్డలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పూడిక తొలగింపు



గెడ్డలో పూడిక తీస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను బుధవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మికి స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వార్డులో ఉన్న గెడ్డలను శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని ధర్నా

ఆరిలోవ: పేదల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఆరిలోవ, మధురవాడ ప్రాంతాల పేదలతో కలిసి బుధవారం సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పాత డెయిరీఫారం నుంచి జాతీయ రహదారి, విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ముందు బైఠాయించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ఆరిలోవ, మధురవాడ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పేదలు నివసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కోసం 2015లో 296, 2017లో 388 జీవోలను విడుదల చేసిందని గుర్తు చేశారు. వాటి ప్రకారం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ఇంతవరకు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలకులు అధికారం చేపట్టి 10 నెలలు గడిచినా పట్టాల రిజిస్ట్రేషన్లతోపాటు ఏ హామీ అమలు చేయలేదన్నారు. కొండవాలు, మురికివాడల్లో రేకుల షెడ్లు నిర్మించుకున్న పేదలకు తక్షణం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు, పట్టాల మంజూరు చేయకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకుల అండదండలున్న భూ కబ్జాదారులకు పట్టాలిచ్చి, రిజిస్ట్రేషన్లు చేసి పేదలను మాత్రం వదిలేస్తున్నారన్నారు. సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, బి.భారతి, డి.కొండమ్మ, డి.నాగరాజు, పి.శంకరరావు, పి.వెంకటరావు, కుమారి, కాంతం, సుజాత, మణి, పుష్ప, రమణమ్మ పాల్గొన్నారు.



రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, పేదలు

ముందుకు వచ్చిన సముద్రం

నిలిచిన బోటు షికారు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వద్ద బుధవారం సముద్రం భారీ కెరటాలతో ముందుకు చొచ్చుకుని వచ్చింది. మత్స్యకారులు తీరం వద్ద ఉంచిన పడవలను, టూరిజం బోట్లను కెరటాలు తాకడంతో పర్యాటకులు భయభ్రాంతులకు గురయ్యారు. వాతావరణ మార్పుల వలన సముద్రంలో బలమైన ఈదురు గాలులుతో పాటు కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో మత్స్యకారులు అప్రమత్తమై బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సాధారణ రోజుల కంటే బుధవారం సముద్రం బాగా ముందుకు వచ్చిందని ఇక్కడ మత్స్యకారులు తెలిపారు. ఇక్కడ నిర్వహిస్తున్న బోటు షికారును వాతావరణం ప్రతికూలంగా మారడంతో ప్రస్తుతం నిలిపివేశారు. రెండు టూరిజం బోట్లను, నాలుగు ప్రైవేటు బోట్లను తీరానికే పరిమితం చేశారు.



రుషికొండ వద్ద ముందుకు వచ్చిన సముద్రం


మానవ జీవన దిక్సూచి భగవద్గీత



ప్రసంగిస్తున్న వక్త రాధారాణి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో 'భగవద్గీత , జీవన సాఫల్యత' అనే అంశంపై ప్రసంగం జరిగింది. ముఖ్య వక్త బి.రాధారాణి ప్రసంగిస్తూ భగవద్గీత చదవడం వల్ల వ్యక్తికి తన గమ్యం, శక్తి సామర్థ్యాలతో పాటు ప్రపంచంతో గల సంబంధ బాంధవ్యాలు అర్థమవుతాయని తెలిపారు. మనిషి తన చుట్టూ ఉన్న పరిస్థితులను సమర్థవంతంతా ఎలా ఎదుర్కోవాలో గీతలో శ్రీకృష్ణుడు చక్కగా చెప్పినట్టు తెలిపారు. భగవద్గీతలో మానవుడు పరిపూర్ణంగా ఎదగడానికి అనుసరించాల్సిన మార్గం గురించి వివరంగా తెలపబడిందన్నారు. ఈ గ్రంథ పఠనం మనస్సుపై అద్భుతమైన ముద్ర వేస్తుందని, ప్రపంచంలో కోట్లాది మంది చదువుతూ పరమోత్కృష్ట ప్రయోజనాన్ని పొందారని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మ కొమ్మకో సన్నాయిలా..





ఈ మొక్కను.. దానికున్న అందమైన పూలను చూస్తే అలనాటి గోరింటాకు సినిమాలోని కొమ్మ కొమ్మకో సన్నాయి.. కోటి రాగాలు ఉన్నాయి అనే పాట గుర్తుకొస్తోంది కదూ.. పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లో ఉన్న ఈ మొక్క పూర్తిగా పూలతో వికసించి సందర్శకులను కనువిందు చేస్తోంది. ఆర్కిడేసి కుటుంబానికి చెందిన డెండ్రోబియం జాతి అఫైలమ్‌గా పిలవబడే ఈ ఆర్కిడ్ మొక్కకు ఎన్నో ప్రత్యేకతలున్నాయని బయోడైవర్సిటీ పార్క్ నిర్వాహకుడు ఎం.రామామూర్తి తెలిపారు. ఇది తూర్పు కనుమల అడవుల్లో ఎత్తయిన చెట్ల వద్ద అరుదుగా కనిపిస్తుందన్నారు. పెద్ద పెద్ద చెట్ల కాండం నుంచి పుట్టుకొస్తుందని, వేసవిలో ఆకులు రాలి పూలు సన్నాయి రూపంలా వికసిస్తాయని వివరించారు. డెండ్రోబియం ఆర్కిడ్ మొక్క పువ్వులు చూసేందుకు ఎంతో ముచ్చటగా ఉన్నాయని సందర్శకులు చెబుతున్నారు. - బీచ్‌రోడ్డు

కోత బారిన సాగర తీరం



తీరంలో కోతకు గురైన చోట మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



పక్కనే కుంగిపోయిన ఫుట్‌పాత్

ఏయూక్యాంపస్: సముద్ర తీర ప్రాంతంలో కోత తప్పడం లేదు. పర్యావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో తరచూ బీచ్ రోడ్డులో ఏదో ఒక చోట తీరం కోతకు గురవుతోంది. తాజాగా పాండురంగాపురం డౌన్ నుంచి ఏయూ యోగా విలేజ్‌కు వెళ్లే మార్గంలోని రెండు ప్రాంతాల్లో ఫుట్‌పాత్, రోడ్డు కుంగిపోయే పరిస్థితి ఎదురైంది. కొన్ని నెలల కిందట ఇదే తరహాలో ఆర్కే బీచ్ వద్ద ఫుట్‌పాత్, రక్షణ గోడ దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించారు. తరువాతి కాలంలో నోవాటెల్ ఎదురుగా ఉన్న పిల్లల పార్క్ వద్ద సైతం తీరం కృంగిపోవడం, రక్షణ గోడలు కూలిపోవడం జరిగింది. ప్రస్తుతం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎదురుగా, దీనికి మరికొద్ది దూరంలో కోకో ఎరీనా సమీపంలో రెండు చోట్ల రోడ్డు, ఫుట్‌పాత్ కుంగిపోతున్నాయి. దీనిని గుర్తించిన జీవీఎంసీ అధికారులు ఒకచోట రక్షణ చర్యలు ప్రారంభించారు. ఇసుక కోతకు గురవడంతో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఫుట్‌పాత్‌ను తొలగించి, కొత్తది నిర్మిస్తున్నారు. అదే సమయంలో దీనికి సమీపంలోనే మరో చోట ఫుట్‌పాత్ భారీగా కుంగిపోతోంది. దీనిని సైతం పునరుద్ధరించే చర్యలు అధికారులు చేపట్టాల్సిన అవసరం ఉంది. పర్యాటకులు, వాకర్లు నిత్యం ఇదే మార్గంలో నడుస్తారు. ఇటువంటి ప్రదేశంలో మరింత భద్రతను కల్పించేలా పనులు నిర్వహించాల్సి ఉంది.

పకడ్బందీగా ఎస్‌ఏ-2 పరీక్షలు

- డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం: పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్–2ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, ఐటీఐ కూడలి కప్పరాడ ఉన్నత పాఠశాలలను డీఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఏ–2 పరీక్షలను ఉపాధ్యాయులు పక్కాగా నిర్వహించి, మూల్యాంకనం అనంతరం మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

డ్రాపవుట్ విద్యార్థుల చేరిక

ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో చదివి, మూడు నెలలు క్రితం పాఠశాల మానివేసి డ్రాప్ అవుట్ అయిన దువ్వి వంశీకుమార్, రాజులను డీఈవో స్వయంగా పాఠశాలల్లో తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గోపాలపట్నం మండల పరిధిలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది డ్రాపవుట్ అయిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో చేర్పించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.దివాకర్, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు, గీత, సీఆర్పీలు లంక చైతన్య, పద్మ, లలిత, కరుణ తదితరులు పాల్గొన్నారు.